18

# అటాప్సీ అను ఓ మేడిపండు కథ

భారతికి దుఖం ముంచుకొస్తోంది. కన్నులనిండా నీరు. గుండెల నిండా, మనసు నిండా జీవితంనిండా కన్నీరే. చుట్టూ చూచిందామె.

గదినిండా నిశ్శబ్దం... టేబుల్ ల్యాంప్ వెలుగు టేబుల్‌నిండా... మిగతా గదంతా చీకటి. ఎదురుగా ర్యాక్ నిండా, బెడ్ వెనుక షెల్ఫ్ నిండా పుస్తకాలు... ఇంట్లో ఎక్కడ చూచినా పుస్తకాలు.. బెడ్‌పై నాలుగేళ్ళ రాజు. ఒక్కడే బిక్కబోయిన ముఖంతో నిద్రపోతూ... వాని ప్రక్కన ఉండవలసిన వాడి తండ్రి... డాక్టర్ జయరాం...

డాక్టర్ జయరాం లేడు.

"అబ్బా... ఈ యింటి నిండా యిన్ని పుస్తకాలేమిటండీ... వీటిని సర్ధలేక విసుగొస్తోంది" అనేది తను.

అతను నవ్వి "అంటే ఈ యింటి అణువణువునా విజ్ఞానం ధ్వనిస్తోంది... అందుకు నువ్వు గర్వపడాలి గదా భారతీ.... " అనేవాడు

ఎప్పుడూ ....

పుస్తకాలే వ్యాపకం... పుస్తకాలే తిండి. పుస్తకాలే జీవితం..

అలాంటి డాక్టర్ జయరాం....

భారతికి దుఃఖం విపరీతంగా ముంచుకొస్తోంది.

ఎదురుగా తెరచి ఉన్న డాక్టర్ జయరాం డైరీ పేజీలను త్రిప్పసాగింది.

2.1.1984

ఎంతో సంతోషంగా వుంది.... ఐతే హృదయంలో రవ్వంత కనిపించని బాధ కూడా కలచి వేస్తోంది. జీవితంలో మొట్టమొదటి ఉద్యోగాన్ని వదిలి వేయడం ఓ రకమైన శూన్యాన్ని మిగులుస్తోంది.

ఐతే ప్రభుత్వరంగంలో ఉన్న ఈ భారీ కార్మాగారంలో యిప్పుడు టాటారీసెర్చి లేబోరేటరీస్‌లో చేస్తున్న ఉద్యోగంకన్న రెట్టింపు జీతం, హోదాగల ఈ సీనియర్ ఇంజనీర్‌గా చేరడం హృదయాన్ని పులకింపచేసే ఆనందాన్ని కలుగజేస్తోంది. నా చదువు, నా తపన... ఈ చిరు జీవితంలో ఈ దేశానికి నేను చేయాలనుకున్న సేవాకాంక్ష... అన్నీ తీరబోతున్నాయి.

ఈరోజు ఉదయం ఎనిమిది గంటల జనరల్ షిఫ్ట్‌లో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శివచరణ్ మాథుర్‌కు నా జాయినింగ్ రిపోర్టునిచ్చాను. నాకో ప్రత్యేకమైన ఆఫీస్‌ను, ఎ.సి.రూంను,ఓస్టెనోనుయిచ్చారు. డిజైనింగ్ సెక్షన్‌ను నాకప్పగించారు. ఫ్లెక్సిబుల్ సిస్టమ్స్‌నురూపొందించవలసిన ఆఫర్ ఒకటుంది. ఆ ఫైల్‌ను చదివి ఎంతో ఆనందం పొందాను. నా ప్రతిభను చూపేందుకు సంపూర్ణావకాశం దొరికింది.

19.2.84

డిజైనింగ్ ఇంజనీర్స్ సెల్‌లో ఈమధ్య కొత్తగా చేరిన మిసెస్ మాథుర్ షా ఒక ఇంజనీర్‌గా పనిచేయడం కన్న తన అందచందాలు, వగలు వయ్యారాలతోనే జనరల్ మేనేజర్ దగ్గర్నుండి అవసరమున్న ఇతర టాప్ ర్యాంక్ ఆఫీసర్లందర్ని ఆకట్టుకుంటోంది. శివచరణ్ మాథుర్‌కు కూడా బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం వంటి వ్యాధులున్నాయి. ఆఫీసర్స్‌లో చాలా వరకు లంచగొండ్లుగా కనిపిస్తున్నారు. ఇంటర్నేషనల్ మార్కెట్‌లో దేశ ప్రతిష్ఠను, ప్రతిభను పణంగాపెట్టి వ్యవహరిస్తున్న ఈ వ్యక్తుల వ్యక్తిత్వాలను, నిజాయితీని, తెలివితేటలను చూస్తుంటే భయం, ఆందోళన, సిగ్గూ కలుగుతున్నాయి.

టాంజానియాకు మనదేశం సప్లయ్ చేయ వలసిన రెండు కోట్ల ప్రిలిమినరీ కోటాను ఖాయం చేసేందుకు ఆఫీషియల్ ఖర్చులపై విదేశీయానం ఘనంగా చేసి వచ్చిన డిప్యూటీ మేనేజర్ రాంమనోహర్ వేలక్కర్ వీలైనన్ని బహుమానాలు, కానుకలతో వచ్చాడు. మిగతా ఆఫీస్ సిబ్బంది కూడా యెవరికితోచిన కానుకలను వాళ్ళు స్వీకరించి పట్టుకొచ్చారు.

పైకి మేడిపండులా కనిపిస్తున్న ఈ ప్రభుత్వరంగ భారీ కర్మాగారంయొక్క అంతర స్వరూపం చూస్తుంటే " అబ్బా యిదేమిటిది యింత ఛండాలంగా వుందన్న" జుగుప్స కలుగుతోంది.

ఆఫీసర్లు మరియు ఇంజనీర్స్ రికమెండేషన్ల మీద, లంచాలమీద నియమించ బడ్తున్నారు. దేశం నిండా బహుళ సంఖ్యలో అలుక్కుపోయిన ఇంజనీరింగ్ కాలేజీలు వేలకు వేలు డొనేషన్స్ తీసుకుని ఫేక్ డిగ్రీ హోల్డర్స్‌ను దేశంలోకి విడిచిపెడ్తున్నాయి. మెషిన్ అంటే తెలియని ఎలక్ట్రానిక్ ఇంజనీర్స్, మానవ శరీర నిర్మాణం గురించే సరియైన అవగాహన లేని డాక్టర్లు ఈ దేశం నిండానిండి ఓ భయంకర ప్రమాదానికి పునాది వేస్తున్నారు. ప్రతిరాష్ట్రంలో ఐ.టి.ఐ.లు ఫైల్ పట్టడం తెలియని ఫిట్టర్లను, మోటార్ వైండింగ్ తెలియని ఎలక్ట్రీషియన్లను లేత్ కంట్రోల్స్ తెలియని మెషినిస్ట్‌లను ఉత్పత్తిచేసి యీ నా మాతృభూమిలోని ఫ్యాక్టరీల్లోకి పంపుతున్నాయి. దేశం నిండా దొంగలుండడం కన్నా ఈ కల్తీ ప్రొఫెషనల్స్ ఉండడం ఎంతో ప్రమాదకరం.

మొన్న ఎఫ్.ఎం.ఎస్. గవర్నింగ్ లైన్‌లో చిన్న ఎలక్ట్రికల్‌ఫాల్ట్ వస్తే డ్యూటీ ఎలక్ట్రీషయన్‌గాని, సూపర్‌వైజర్‌గానీ, వాళ్ళమీదున్న ఎలక్ట్రానిక్ ఇంజనీర్‌గానీ దాన్ని

కనుక్కోలేకపోయారు. రెండుగంటలు సిస్టం మొత్తం స్తంభించిపోయింది. నష్టం రెండులక్షలు. దీనిక్కారణం ఈ కల్తీ మనుషులకు వాళ్ళు చేయాల్సిన పని తెలియకపోవడం. ఎవరు భరిస్తారీ నష్టాన్ని, ఎవరీ నష్టానికి కర్తలు. ఈ డబ్బు ఈ దేశ ప్రజలది. దరిద్రంలో మ్రగ్గుతున్న ఈ జనానిది. ఎందుకింత పవిత్రమైన డబ్బు ఈ రకంగా ధ్వంసం చేయబడ్తోంది.

ఇంటిముందు రాత్రి కాపలాకుంచిన కుక్క తన విధిని నిర్వర్తించకపోతే.. ఇంట్లో దొంగలుపడి నష్టంవాటిల్తే ఆ కుక్కను కాల్చిచంపుతాం. మరి ఈ రకంగా విధి నిర్వహణ తెలియని ఈ పేడితరం, ఈ దేశాన్ని తొలిచి కోట్లకుకోట్లు నష్టం కలిగిస్తోంటే ఏం చేయాలి. వాట్ టు డు.. ఎ హెల్.. ఎ... హెల్..

26.2.84

మనదేశంలో చాలావరకు దురదృష్టవశాత్తు సాంకేతికపరమైన నిర్ణయాలనూ ఒప్పందాలనూ కూడా రాజకీయ నాయకులే చేస్తున్నారు. విదేశీ పర్యటనల్లో, చర్చల్లో నాయకులకు శాస్త్రీయమైన సలహాలనూ అవగాహననూ అందించేందుకు ఆఫీసర్ల బృందం తోడ్పడాలన్న ఓ ఆనవాయితీ ఉన్నా అత్యంత శక్తివంతమైన నిర్ణయాధికారాలు రాజకీయ నాయకుల చేతుల్లోనే ఉన్నందువల్ల ఆఫీసర్స్ వాళ్ళ మెహర్బానీ కోసం మెప్పుపొందడం కోసం ఆయా నాయకునికి అనుకూలంగా సలహాలనివ్వడం దేశ ప్రయోజనాలను బలిపెట్టడం, స్వలాభం కోసం అమ్ముడు పోవడం చేస్తున్నారు. విదేశాలతో కోట్లరూపాయల ఒప్పందాలు కుదుర్చు కుంటున్నప్పుడు వ్యక్తిగతంగా లభించే నజరానాల కోసం ప్రజలకు విపరీతస్థాయిలో నష్టం కలుగజేస్తున్నారు.

ఇప్పుడు సరిగ్గా అదే జరిగింది.

కేంద్రమంత్రి జెకోస్లోవేకేవియా సందర్శిస్తూంటే ఆయన వెంట సలహాదారుల బృందంలో మా ఫ్యాక్టరీ చైర్మన్ డాక్టర్ షా వెళ్ళారు. పద్నాలుగు కోట్ల రూపాయల న్యూమరికల్ కంట్రోల్డ్ మెషిన్ మనదేశం నుండి సరఫరా చేయబడేట్టు ఒప్పందం చేసుకున్నారు. ప్రతిగా వాళ్ళు ఓ సాంస్కృతిక బృందాన్ని పంపడం లాంటి అంగీకారాలు కుదుర్చుకున్నారు ఎన్‌సి యంత్రాలను మన స్వంత పరిజ్ఞానంతో తయారు చేసి పంపే స్థితి నిజానికి మనకింకాలేదు. చేస్తాం... పైగా చేసి ఓ అపూర్వ జ్ఞానమున్న విదేశానికి ఎగుమతి చేస్తాం అని సిద్ధపడ్డం దుస్సాహసమే ఔతుంది.

ఈ రోజు డాక్టర్ షా టాప్ మేనేజరియల్ స్టాఫ్ మీటింగ్ ఏర్పాటుచేశారు. ఎనిమిది వేలు ఖర్చు. సిఎన్సీ, మెషీన్స్, వాటి స్పెసిఫికేషన్స్ గురించి అతను మాట్లాడుతుంటే వాటి డిజైన్స్ గురించి చెప్తూంటే నవ్వొస్తోంది. మెషిన్స్, పర్ఫార్మెన్స్ యాక్యురసీ, లిమిట్స్ వంద మైక్రాన్స్ అర్థరట. మెషిన్ డిజైన్ గురించి అతను నన్నడుగుతున్నపుడు నేను దాంట్లో వున్న క్లిష్టత గురించి మాట్లాడుతూంటే మిసెస్ మాధుర్ షా తను ఆ బాధ్యతను చేబడ్తానని ముందుకొచ్చింది. ఎందుకంటే ఆ జాబ్‌కు కంపెనీయిచ్చే రాయల్టీ బోలెడుంటుంది.

29.2.84

జెక్ మన దగ్గర యంత్రాలు కొంటానని ఒప్పుకుని ఆర్డర్ చేసింది. అంటే మనం తయారుచేసిన వాటిని డిఫెక్టివ్స్‌గా నిరూపించి ఇంటర్నేషనల్ మార్కెట్‌లో మనల్ని, మన సాంకేతిక సమర్థతను అవహేళన చేయడానికేనని ఈ ఎస్.సి. మెషీన్ల కొనుగోలు వ్యవహారమని అధ్యయనం చేస్తే నాకు అర్థమైంది. ఆ విషయాన్ని చైర్మన్‌తో అంటే అతను భుజాలు తడుముకుని, నీళ్లు నమిలి ఉగ్రంగా చూశాడు నా వంక.

నిజం ఎప్పుడూ చేదుగానే ఉంటుంది.

ఐతే మాథుర్ షా స్వీకరించిన ఈ ప్రాజెక్టు ఆమెనూ, జి.ఎం.నూ, చైర్మన్ షానూ పరోక్షంగా భయపెడ్తోంది. ఎందుకంటే వాళ్ళకు పూర్తిగా అడ్వాన్స్డు టెక్నిక్ ఐన ఈ రంగంలో అవగాహనలేదు. ఆ ఫీల్డ్‌లో డాక్టరేట్ తీసుకున్న నన్ను ఎలిమినేట్ చేయడం వాళ్ళు చేసిన తప్పుగా గ్రహించారు.

అందుకే ప్రాజెక్ట్ గైడ్‌గా తప్పనిసరి పరిస్థితుల్లో నన్ను నియమించారు.

ఛాలెంజ్‌గా తీసుకుని ఈ బాధ్యతను స్వీకరించడం ఆనందంగా వున్నా... మేనేజిమెంట్ రాజకీయాలాడుతుందని భయంగా వుంది.

14.5.84

మిసెస్ మాథుర్‌షా సి.ఎన్.'జి (కంప్యూటరైజ్డ్ న్యూరికల్ కంట్రోల్డ్) మెషిన్స్ ప్రిలిమనరీ డిజైన్‌ను ఈ రోజు ప్రతిపాదించింది.

ఈ రెండున్నర నెలలు రాత్రింబవళ్ళు శ్రమించి నేను తయారు చేసిన నా డిజైన్‌ను కూడా ఈ రోజు కౌన్సిల్‌లో పెట్టాను. ఎక్స్‌పర్ట్స్ ఫైనల్ చేయాలి ఏదో ఒక దానిని.

మాథుర్‌షా డిజైన్‌ను చూస్తే నాకైతే నవ్వొచ్చింది. ఆమె ముఖ్యమైన కాంపొనెంట్స్‌కు స్పెసిఫై చేసిన మిశ్రమలోహ సమ్మేళనాలే సరిగాలేవు. యంత్రం పనిచేస్తున్నపుడు ఉత్పత్తి అయ్యే బలాలను తట్టుకునే సామర్థ్యం ఆమె చెప్పిన లోహానికుండదు. అది అసలు మషినబుల్ కాదు. ఎలక్ట్రానిక్ కంట్రోల్స్‌లో ఆమె హైపవర్ థైరిస్టర్స్‌ను సూచించింది. నేను మరీ ఆధునికమైన పల్స్ విత్ మాడ్యులేషన్ పి.డబ్ల్యు.ఎమ్‌ను సజెస్ట్ చేశాను. పవర్ ట్రానిస్టర్‌ను డిజైన్ చేశాను. హనీ కోంబ్ కార్వింగ్ డిజైన్‌ను రూపొందించాను. లేజర్ మషినింగ్ సిస్టంను చొప్పించి చిప్పింగ్ పద్ధతిని తీసివేశాను. ఆమె ప్రతిపాదించిన టూల్ కట్టింగ్ పద్ధతిని తీసివేశాను.

ఆధునికత ... ఎకానమి.. ప్రతిష్ట.... ఇవి నా లక్ష్యాలు...

పాతపచ్చడి.. ఎక్కువ ధర... స్వార్థం... లోపభూయిష్టత... ఆమె చెప్పేది.

ఐతే ఈ మధ్య మిసెస్ మాథుర్‌షా జి.ఎం. శ్రీమాథుర్‌తో అనేక పార్టీలకు హాజరు కావడం.. ఎంతో చనువుగా ఉంటూ కంపెనీ వ్యవహారాల్లో శక్తివంతమైన మనిషిగా

చలామణిగాపడం...మనుషులను తనవైపు ఆకర్షించుకోవడం ఒక ఎక్స్‌పర్ట్స్ సభలో నేను అనుకున్నట్లుగానే జరిగింది. సరిగ్గా నా డిజైన్స్‌ను నిరాకరించి మిసెస్ మాథుర్ షా ప్రపోజల్స్‌ను మెషీన్ తయారీకి రికమెండ్ చేశారు. ఫైల్ ప్లాంట్‌కు వెళ్ళిపోయింది.

అవమానం... ఆత్మ క్షోభ మిగిలింది. ఏరంగంలో ఎవరైతే అథరైజ్డు ప్రతిభా వంతుడుగా గుర్తించబడ్డాడో వాని మాట కాదని ఓ సాధారణ ఇంజనీర్‌ను అంగీకరించారు. నిజంగా ఆమె చెప్పిన దాంట్లో సత్యం ఉంటే నేను కూడా ఆమె చెప్పిందాన్ని అంగీకరింతును. కాని, రాజకీయాలు, పైరవీలు, మస్కాలు, ఏవేవో యిచ్చి పుచ్చుకోవడాలు. ఇవీ ఈ వ్యవస్థను నియంత్రిస్తున్నాయి.

సిగ్గు.... సిగ్గు.... సిగ్గు.....

సిగ్గు మిగిలింది. సహచరులు నా గురించి హేళనగా మాట్లాడుతున్నారు. ఓడిపోయిన అనుభూతి. మనసులో కోటి అడవులు కాలి నన్ను దహించి వేస్తున్న ఫీలింగ్స్, అన్యాయం జరుగుతోంది... కోట్లరూపాయలు నాశనం చేయబడ్తున్నాయి... అవి మీవే.. ఓ గుడిసెల్లో వుండే భారత ప్రజల్లారా ఈ డబ్బు మీదే ... అది ఈ రకంగా ధ్వంసం చేయబడ్తోంది. ... అని వీధుల్లో అరచి చెప్పాలనీ... బహిరంగంగా న్యాయస్థానాల్లో ఈ దొంగలను ప్రశ్నించాలనీ ఆరాటం...

కాని....

కన్నీరు... హృదయం నిండా కన్నీరు...

22.6.84

సి.ఎన్.సి. మెషిన్స్ తయారీవింగ్‌ను సందర్శించాను.

మరీ సిగ్గుగా ఉంది.

అవమానంతో.. అయ్యో నా ప్రతిభనీ దేశం గుర్తించట్లేదే అన్న బాధ ఓవైపు నన్ను దహిస్తుంటే డిపార్ట్‌మెంట్‌లో రోజురోజుకూ ఎదురవుతున్న నిరాదరణ లజ్జాకరంగా వుంది.

వాట్ టు డు.

అసలా యంత్రం డిజైనే లోపభూయిష్టం. అది మాన్యుఫాక్చరింగ్‌కు రాగానే క్వాలిటి కంట్రోల్ సిస్టం దొంగల చేతుల్లోఉండడం వల్ల తయారీ ధర పెరిగి.. ప్రమాణాలు తరిగి, ప్చ్....

చాలా బాధగా వుంది. కాని నేనేం జేయను.

అందరూ... 'ఇదేమిట్సార్ అలా ఉంటున్నారు'అంటున్నారు. గుడ్డలు... షేవింగ్.... రీసెర్చి.... వీటి మీద మనసే లేదు. ఓ రకమైన ఘర్షణ ... అందులో నుండి ఆత్మన్యూనత....కృంగిపోతున్నాను.

ఈ జీతం...అలవెన్సులు.... బోనస్‌లు... ఇవేవీవద్దు. నా ప్రతిభను గుర్తించండి...

.నన్ను ఈ దేశంకోసం వాడుకోండి.

నా భార్య కూడా " మీరు అదోలాఉంటున్నారు. ఏదో లోకంలో ఉన్నట్టు" అంటోంది.

మినిస్ట్రీ ఆఫ్ ఇండస్ట్రీస్‌కు సుదర్ఘీమైనలేఖ రాశాను.

సి.ఎన్.సి.మెషిన్స్ ఈ రోజు షిప్పింగ్ జరిగి ఎగుమతి అవుతున్నాయి. పన్నెండు కోట్లరూపాయల్లో కావలసిన యంత్రాలు పదహారు కోట్లుదాటాయి. ఇన్‌స్పెక్షన్‌లో ఎన్నో లోపాలు తేలాయి. ఐనా సర్టిఫికెట్ ఇచ్చి కనసైన్మెంట్ పంపారు. రాత్రి విందు... జల్సా....

మినిస్ట్రీఆఫ్ ఇండస్ట్రీస్ నుండి ఎలాంటి జవాబులేదు. రెడ్‌టేపిజం. లేక పైరవీ ప్రభావమై ఉండవచ్చు.

విందును బహిష్కరించాను.

ఒంటరిగా ఫీలౌతున్నాను.

20.8.84

మిసెస్ మాధురీషాకు- ప్రమోషన్ యిచ్చారు. స్పెషల్ పే శాంక్షన్ చేశారు. ఐతే ఆమెపై నాకెలాంటి ద్వేషంలేదు. ఈ రకంగా కల్తీతో,అవినీతితో, పైరవీలతో కుత్సితమైన రాజకీయాల్లో కుళ్ళిపోతున్న ఈ వ్యవస్థ పైన అసహ్యం, చీదరింపు కలుగుతోంది.

మనసునిండామౌనం... నిశ్శబ్దం.. ఎవరో కవి రాసిన వ్యాక్యాలు గుర్తొస్తున్నాయి.

ఎవనిదయ్యా ఈదేశం ..ఎవనిదయ్యా ఈ దేశం...

" ఈ ఇల్లు నాది,
ఈ ఉద్యోగం నాది,
ఈ లంచాలునావి, ఈ మంచాలు నావి,ఈ సుఖాలు, సుఖవ్యాధులు నావి.
కానీ దేశంమాత్రం ఎవడిదో.."

...... హృదయం నిండా తుపాను.

9.9.84

మినిస్ట్రీ ఆఫ్ ఇండస్ట్రీస్ నుండి కంపెనీ ఎక్స్‌ఫర్ట్‌పై కామెంట్ చేస్తు లేఖ రాసినందుకు మెమో నాకు వచ్చింది.

యిక్కడ దొంగతనం జరుగుతోందని చెప్తే మెమో.

హహ్హహ్హా -

దేశమా వర్ధిల్లు.

దేశమాత కోసం ప్రాణాలను త్యాగం చేసే వీరులను తయారుచేయాల్సిన విద్యారంగం ఓ మొక్కుబడిగా నిర్వహించబడ్తూ నిర్వీర్యమైన తరాలను తయారు చేస్తుంటే ఒంటి నిండా గాయలతో, పుండ్లతో, రోగాలతో ఓ నాదేశమా వర్ధిల్లు.

31.9.84

విలువ, ఆదరణ, గుర్తింపులేని చోట పనిచేయడం ఎంత నరకమో అర్థమౌతోంది నాకు.

ఈ మనుషులు... ఈ కృత్రిమపు నటనలు.. ఒకన్నొకడు దగా చేసుకోవడాలు అసహ్యం.. రోత... ఏవగింపు...

మనసు ఏమాత్రం బాగుండ లేదు. టూల్ డిజైన్స్ పై ఏడు డాక్టరేట్లు పొందిన నేను ఈ నరకంలో కృంగిపోతున్నాను.

10.10.84

జెకోస్లొవేకియా నుండి యిక్కడ నుంచి పంపిన మెషిన్ల క్వాలిటి చాలా నాసిరకంగా ఉందనీ, యాక్యురసీ అసలు లేనేలేదని షిప్‌మెంట్ మొత్తం వాపసు వస్తున్నట్టు వర్తమానం వచ్చింది.

కంపెనీ అంతా అట్టుడికిపోతోంది.

16.10.84

సి.ఎన్.సి. మెషిన్ల డిజైన్స్ ప్రాజెక్టుగైడ్‌గా నాకు కంపెనీ సంజాయిషి మెమోను పంపింది. కాంట్రాక్ట్ తెచ్చిందెవరు. కానుకలు పొందిందెవరు.

ప్రమోషన్లు కొట్టిందెవరు... అసలు ఈ పాడు డిజైన్స్ చేసిందెవరు? మెమోలు పొందేదెవరు?

డర్టీ సొసైటీ... డర్టీ రోగ్స్.... బాస్టర్డ్స్

17.10.84

ఉదయం పేపర్లల్లో "సీనియర్ ఇంజనీర్ డాక్టర్ జయరాం దుర్మరణం -ఫాన్‌కు ఉరేసుకుని... వ్రేలాడుతున్న అతని శవం వద్ద ఈ దేశాన్ని, ఈ తరాన్ని ఈ వ్యవస్థను ప్రశ్నిస్తున్న అతని డైరీ...

★ ★ ★

భారతి కళ్ళు తుడుచుకుని డైరీ వ్రాయడం ప్రారంభించింది.

24.10.84

డాక్టర్ జయరాం ఆత్మహత్య చేసుకోలేదు. ఈ సంఘంచే, ఈ అవినీతి పరులైన మనుషులచే, ఈ దుష్ట సమాజంచే హత్య చేయబడ్డాడు.

ప్రభుత్వంచే, నాయకులచే, మేధావులచే విస్మరించబడి రుజగ్రస్తమైన ఈ సమాజాన్ని పునర్నిర్మించడానికి ఒకేఒక మార్గం కనిపిస్తోంది నాకు.

అది మరో క్రొత్త తరాన్ని తయారు చేయడం.

అందుకే పోస్ట్ గ్రాడ్యుయేట్‌నైన నేను రేపటినుండి ఉపాధ్యాయినిగా మారతాను మరో.. మరో డాక్టర్ జయరాంను తయారుచేసి ఈ సంఘాన్ని బతికిస్తాను.

'స్వాతి' మాసపత్రిక

మార్చి 1983